క్లుప్తంగా

వరదబాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాల సేకరణకు ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

కొత్తవలస: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తుమ్మికాపల్లిలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు మంగళవారం విరాళాలు సేకరించారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు,ఇళ్లకు విద్యార్థులు,అధ్యాపకులు ర్యాలీగా వెళ్లి రూ. 54,490 సేకరించారు. ఈ నిధికి తమ వంతుసాయం జత చేసి సీఎం సహాయనిధికి పంపిస్తామని కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

ఆస్పత్రికి గీజర్ల అందజేత



ఆస్పత్రికి గీజర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్ రూ.60,000తో రెండు వాటర్ గీజర్లను స్థానిక ప్రభుత్వాస్పత్రికి సమకూర్చారు. వీటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఆస్పత్రిని సందర్శించినప్పుడు వేడి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని బాలింతలు, గర్భిణులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు.ఈవిషయం గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌కు చెప్పడంతో ఆయన రెండు గీజర్లను ఆస్పత్రికి ఇచ్చారని తెలిపారు.

పర్యావరణ హితం



మొక్కలు నాటుతున్న హైవే అధికారులు, విద్యార్థులు

జామి: పర్యావరణ పరిరక్షణ కోసం నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మంగళ వారం మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రింగు రోడ్డు కూడలి వద్ద విజినిగిరి రామాస్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) పీడీ రోహిత్‌కుమార్,డీఎం కిరణ్ ధవవత్, హైవే ప్రాజెక్ట్ అధికారి ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



పీఈటీల శిక్షణలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వరరావు

గజపతినగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా చూడాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని స్థానిక బాలుర హైస్కూల్ హెచ్‌ఎం మీసాల వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గస్థాయి పీఈటీల స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం స్థానిక బాలుర హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. పీఈటీలు విద్యార్థులకు ఏవిదంగా ఆదర్శంగా నిలవాలి, యోగా, రిక్రియేషన్ గేమ్స్, ఏరోబిక్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పీఈటీల నియోజకవర్గ ఇన్‌చార్జి చింత సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదానం



గుర్ల: అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గుర్ల: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో చేగువేరా యూత్ కమిటీ ఏర్పాటు చేసిన మండపం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు.
మెరకముడిదాం: మండల కేంద్రంలోని డాబా వీధిలో, సోమలింగాపురం గ్రామంలో, ఎం.రావివలస తదితర గ్రామాల్లో వినాయకనవరాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు.

ఎన్‌సీసీ ఎంపికలు

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. రాతపరీక్షలతో పాటు శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించగా... నిర్ణేతలుగా విజయనగరం సెకెండ్ ఆంధ్రా బెటాలియన్ సుబేధార్ జె.చంద్రరావు, సుబేదార్ సి.హుసేనయ్య, హవాల్దార్ ఎస్.భాస్కరరావు వ్యవహరించారు. విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలో కూడా ముందుండాలని, అందుకోసం ఎన్‌సీసీలో చేరాలన్నారు. కేర్‌టేకర్ పూజిత, పీడీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



లక్కవరపుకోట: ఎల్.కోట మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు,అధికారులు

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పలు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు మానవహారాలుగా ఏర్పాటయ్యారు. స్వచ్ఛతకు కట్టుబడి ఉంటామని, వారానికి రెండు గంటలు శ్రమదానం చేస్తామని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయబోమని, పర్యావరణ పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలలో, రోడ్లపై చెత్తను ఊడ్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: ఎస్.కోట సచివాలయంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



దత్తిరాజేరు: మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తవలస: కొత్తవలస మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న ఎంపీపీ గోపమ్మ.. అధికారులు



మెరకముడిదాం: మెరకముడిదాంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్త ఊడ్చుతున్న ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, అధికారులు



గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ తప్పు, తదితరులు



శృంగవరపుకోట: వీరనారాయణంలో చెత్త ఊడుస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



గుర్ల: గుర్ల మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు



గజపతినగరం: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా విశ్వకర్మ జయంతి



కొత్తవలస: రైల్వేస్టేషన్‌లో టెలికమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం



కొత్తవలస: రైల్వేస్టేషన్‌లో విశ్వకర్మ విగ్రహం ఏర్పాటు చేసి పూజలు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది

కొత్తవలస: మూడు రోజుల పాటు నిర్వహించనున్న విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవాలు కొత్తవలస రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం ప్రారంభమయ్యాయి.ఎలక్ట్రికల్, టెలికమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్లు వారు వేర్వేరుగా విశ్వకర్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో హోమం

గజపతినగరం: విశ్వకర్మ జయంతి నేపథ్యంలో పురిటిపెంట గ్రామంలోని సంతతోట కాలనీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అర్చకులు మణికంట శాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గజపతినగరం: పురిటిపెంట వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

ఈ-క్రాప్,ఈకేవైసీ శతశాతం పూర్తిచేయాలి

జామి: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు ఈకేవైసీ ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవాకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఈ- క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీలోగా రైతులు ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. .ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యాలకు పంటదెబ్బతింటే నష్టపరిహారం రాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించు కునే అవకాశం ఉండదన్నారు. ఆయన వెంట ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

బెంచ్‌ప్రెస్ పోటీల్లో సత్తా చాటిన కోచ్‌లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణానికి చెందిన ది రోయల్ జిమ్ కోచ్‌లు బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య,సిల్వర్ పతకాలు సాధించారు. ఏపీ స్టేట్‌మీట్-2024 క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 14,15వ తేదీల్లో అమలాపురంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గరివిడి రోయల్ జిమ్ కోచ్ వై.దుర్గావరప్రసాద్ బెంచ్‌ప్రెస్ విభాగంలో కాంస్య పతకం సాధించగా, 84 కేజీల జూనియర్ విభాగంలో ఎస్.రేణుకాకల్యాణి సిల్వర్ పతకం సాధించింది.



పతకాలతో దుర్గావరప్రసాద్,రేణుకాకల్యాణి

నిధులు ఇవ్వకుండా ఆ బాధ్యత మాకెందుకు..?



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనరసమ్మ



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

- జలజీవన్ పథకం నిర్వహణపై అధికారులను ప్రశ్నించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- దేవరపొదిలాంలో ఉన్నత పాఠశాల లేకుండా చేశారు
- గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులనే మంజూరు చేయాలి
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

చీపురుపల్లి: 'కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి జలజీవన్ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆ పథకం నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తారో అర్థం కావడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పథకం నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లదే అంటే తమకేం సంబంధం' అంటూ మండల సర్వసభ్య సమా వేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో గొల్లలములగాం సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు, నిమ్మలవలస, మెట్టపల్లి ఎంపీటీసీలు అధికార్ల శ్రీనుబాబు, మీసాల ఈశ్వరరావు మాట్లాడుతూ జలజీవన్ పథకానికి సంబంధించి పైపులు, కుళాయిలు, మోటార్లు పాడైతే వాటికి మరమ్మతులు చేయించడం ఎలా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఈ పథకం నిర్వహణ కోసం సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, రోజూ ఇంటికి రూపాయి వసూలు చేసి ఆ డబ్బులతో పథకం నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లే చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామకృష్ణ తెలిపారు. దీనికి సర్పంచ్‌లు స్పందిస్తూ నిధులు లేకుండా ప్రజల నుంచి వసూళ్లు చేసే బాధ్యతలు తమకొద్దన్నా రు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ కార్యదర్శుల ద్వారా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవరపొదిలాం గ్రామానికి గత ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంజూరు చేస్తే, కూటమి ప్రభుత్వం ఆ పాఠశాలను లేకుండా చేసిందని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో అక్కడున్న విద్యార్థులు అంతా టీసీలు తీసుకుని వెళ్లిపో యా రని నిమ్మలవలస ఎంపీటీసీ అధికార్ల శ్రీనుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోయి మలుపుల వద్ద రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే జంగిల్ క్లియరన్స్ పనులు చేయించాలని అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాథ్ కోరారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ప్రతిపాదించిన పనులు మంజూరవుతాయో లేదో ఉపాధి హామీ అధికారులు స్పష్టత ఇవ్వాలని, గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులనే మంజూరు చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ వెంకటనరసమ్మ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన అంశాలపై మినిట్స్ సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజుకు సూచించా రు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఉప సర్పంచ్ కరిమజ్జి వెంకటరమణమ్మ, తహసీల్దార్ ఎన్.రాజారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.సతీష్‌కు గురుపూజోత్సవం రోజున లక్ష్య ఫౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన సోంపురం స్కూల్ కాంప్లెక్స్‌లో ఎంఈఓ జగదీశ్వరరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి.పి.ఏ.రాజు, ఉపాధ్యాయులు ఆయన్ని సన్మానించారు.



ఉపాధ్యాయుడు సతీష్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు, తదితరులు

పౌష్టికాహారం తీసుకోవాలి

గంట్యాడ: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమాభారతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వసంత గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ప్రసవ సమయానికి రక్తహీనత సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం బారిన పడకుండా ప్రతీ రోజు ఆహారంలో కూరగాయాలు, పండ్లు తీసుకోవాలన్నారు. సర్పంచ్ శిరికి అచ్చియ్యమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

నులిపురుగులతో పిల్లలు, విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని...నులిపురుగుల నివారణకు, పిల్లల ఆరోగ్యం కోసం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అధికారులు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథ మిక, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు,మోడల్ స్కూళ్లు, వసతిగృహాలు, జూనియర్ కళాశాలల్లో వైద్య సిబ్బంది పిల్లలు, విద్యార్థులతో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. 1 నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులు, విద్యార్థుల్లో చాలా మంది నులిపురుగులు కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం ఏర్పడి పిల్ల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయని, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, అలసట, వికారం, బద్ధకం, నిరంతరం దగ్గు, దురద వంటి అనారోగ్య సమస్యలు వేదిస్తాయని వివరించారు. ఈ సమస్యలకు ఆల్బెండజోల్ మాత్రలతో చెక్ పెట్టవచ్చని, ఆరు నెలలకోసారి ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు.

– చీపురుపల్లి /చీపురుపల్లిరూరల్(గరివిడి)/ దత్తిరాజేరు/గంట్యాడ/లక్కవరపుకోట/ కొత్తవలస/బొండపల్లి/వేపాడ/ మెరకముడిదాం/శృంగవరపుకోట



శృంగవరపుకోట: వెంకటరమణపేట గ్రామంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఐసీడీఎస్ పీఓ ఉమ, తదితరులు



లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



చీపురుపల్లి: చీపురుపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష



మెరకముడిదాం: మెరకముడిదాం కేజీబీవీలో విద్యార్థినులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ రత్నం, తదితరులు



బొండపల్లి: దేవుపల్లిలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, తదితరులు



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో పిల్లలతో మాత్రలు మింగిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు



దత్తిరాజేరు: మరడాం హైస్కూల్‌లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు



కొత్తవలస: కంటకాపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి కేజీబీవీలో విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది



దత్తిరాజేరు: కె.కొత్తవలస గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



గంట్యాడ: గంట్యాడ హైస్కూల్‌లో విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ ఎర్రన్న

సంక్షిప్తంగా...

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి

గజపతినగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులను డీపీఓ శ్రీధర్ రాజా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. ఎంపీడీఓ కిశోర్ కుమార్, ఇన్‌చార్జి ఈఓపీ ఆర్డీ పప్పు సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

గుర్ల: అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు సీజ్ చేసిన 76.5 టన్నుల ఇసుకను స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ పి.నారాయణ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ సమక్షంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొన వచ్చని సూచించారు.

అచ్చారావుకు నివాళి

వేపాడ: ఏపీ దళిత కూలీ రైతుసంఘం రాష్ట్ర కోశాధికారి తాడి అచ్చారావు వర్ధంతిని మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అచ్చారావు చిత్రపటానికి మాలమహానాబు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్, దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్తిబాబు, నాయకులు కోలా సతీష్, ముత్యాలనాయుడు, ఏడువాక అప్పలనాయుడు, దేబార్కి అప్పారావు, గట్టు వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.



అచ్చారావు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దళిత నేతలు

నేడు రక్తదాన శిబిరం

చీపురుపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించను న్నట్లు బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.